క్లుప్తంగా

నేడు శ్రీ భూ వరాహస్వామి కల్యాణ మహోత్సవం

మోతీనగర్: జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి అవంతినగర్‌లోని శ్రీ శివ రామాంజనేయ ఆలయంలో శ్రీ భూ వరాహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. దిట్టకవి శ్రవణ్ స్వామీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నవ వధువు ఆత్మహత్య


నందిని (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: వివాహం జరిగిన నెల రోజులకే ఓ నవ వధువు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసంత్‌నగర్‌లో నివసించే నరేష్ గౌడ్‌కు గాజుల రామారంలో నివాసం ఉండే నందిని (23)కి నెల రోజుల క్రితం వివాహమైంది. భర్త ఇంటి వద్దనే ఉన్న నందిని శనివారం రాత్రి 7 గంటల సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వధువు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్సై రామ్మోహన్ రెడ్డి వివరించారు.

మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలి


అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, వీసీ కట్టా నర్సింహారెడ్డి తదితరులు

జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా అవగాహన కల్పించడంలో కళాశాలలు, విశ్వ విద్యాలయాలు కీలక పాత్ర పోషించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. శనివారం కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ధర్మసేన చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిషేధిత మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా భవిష్యత్తులో మత్తు పదార్థాల కేసులు రెట్టింపయ్యే ప్రమాదం ఉందన్నారు. 2023 మొదటి ఐదు నెలల్లోనే డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల్లో పెరుగుదల కనిపిస్తోందన్నారు. ఆయా కేసుల్లో ఎక్కువ శాతం శిక్షలు పడుతున్నా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక ఒత్తిడి, వాస్తవికతను తప్పించుకునేందుకు యువత మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్నారని, మత్తుపదార్థాలకు బానిసైన వారిని సులభంగా గుర్తించవచ్చన్నారు, వారికి సరైన సమయంలో చికిత్స అందించాలని సూచించారు. డ్రగ్స్ క్రయ విక్రయాలపై నిఘా పెంచి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రత్యేకంగా సైకాలజిస్టును ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, టీయస్‌ఎల్‌ఎస్‌ఏ మెంబర్ సెక్రటరి ఎస్. గోవర్ధన్‌రెడ్డి, ధర్మ సేవా జె. నిశాంత్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం


వినాయక్‌నగర్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదతరులు

బాలానగర్: నియోజక వర్గ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు డప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. వినాయక్ నగర్‌లో రూ. 88 లక్షలతో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం దశలవారీగా అభివృద్ధి చెందుతుందన్నారు. గడిచిన 9 ఏళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కరెంటు కోతలతో ఇబ్బంది పడిన రాష్ట్రంలో మిగులు విద్యుత్ సాధించామన్నారు. ఆనాడు నీటి కొరత సమస్యను ఎదుర్కొన్న రాష్ట్రం ప్రస్తుతం మిషన్ కాకతీయతో రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్ ఇస్తుండటంతో పంటల దిగుబడిని భారీగా పెరిగిందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ, బస్తీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం'

బాలానగర్: కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, డా. సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ చెరబండ రాజు కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ప్రవీణ్‌కుమార్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల చెక్కును శనివారం టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, డా. సత్యం శ్రీరంగం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది సభ్యత్వ నమోదు చేయించుకున్నారని వారందరికీ ఉచిత బీమా వర్తిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కార్యకర్తలు, పేదల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల సంక్షేమానికి కృషి చేస్తామని, అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్, మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, బందిగ బాలనర్సింహా, సయ్యద్ మిస్బా ఉద్దీన్, రిషియాదవ్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అరుణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల అందజేత

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చిరు వ్యాపారులకు వేసవి నేపథ్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ శనివారం గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు వేసవి కాలంలో ఈ గొడుగులు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. గొడుగులు అందించిన చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీనివాస్, ఖాజా, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, సాయిగౌడ్, పుట్టం దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం...

అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లమ్మబండ, గాంధీ నగర్‌కు చెందిన కొత్త కృష్ణ కుటుంబాన్ని శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులపై దాడి అమానుషం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ప్రగతినగర్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులపై మున్సిపల్ సిబ్బంది దాడికి పాల్పడటం దారుణమని పీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం ఆయన ఆధారం కోల్పోయిన చిరువ్యాపారులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పేదలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బతుకుదెరువుకు నగరానికి వలస వచ్చారన్నారు. వారిలో కొందరు ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటి వారిపై మున్సిపల్ సిబ్బంది దాడి చేసి షాపులను ధ్వంసం చేయటంతో వారు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి వ్యాపారాలకు నష్టం చేకూరే విధంగా ప్రవర్తించటం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాధితులకు తక్షణ సహాయంగా శ్రీరంగం ఫౌండేషన్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు క్రిష్ణారాజ్ పుత్, తూము వేణు, హరి, శ్రవణ్, జహంగీర్, గజానంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దావూద్ వెంకటేశ్వరనగర్‌లోని నూర్ ఈ మొహమ్మద్ మజీదు ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. నీటి సమస్యను ఆయా ప్రాంతాల ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యపై అధికారులతో చర్చించి త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజిద్ సదర్, జలీల్, ఇసాక్, ఇమ్రాన్, జలీల్, శకీల్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించాలి

కూకట్‌పల్లి: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా వారి తల్లిదండ్రులను చైతన్యం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల ఇంటింటికి వెళ్లి పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన చిన్నారులకు ప్రభుత్వమే ఉచితం పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ విద్య, మధ్యాహ్నం భోజన పథకం, స్మార్ట్ తరగతి గదులు, ఉత్తమ అనుభవం కలిగిన బోధనా సిబ్బంది, సీసీ నిఘా, ఆటల పోటీలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యాబోధన అందుతుందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం3,4 తరగతుల విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారు. శుక్రవారం పతాక ఆవిష్కరణ అనంతరం ప్రధానోపాధ్యాయులు సిబ్బందితో సమావేశమై బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కనీ గోడ కూలి బాలుడి దుర్మరణం

మూసాపేట: మూసాపేట పరిధిలోని ప్రగతినగర్‌లో ఓ పురాతన ఇంటి బాల్కనీ పిట్టగోడ కూలి బాలుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెల్పిన వివరాల మేరకు విజేత అనే మహిళకు చెందిన పాత ఇంటి బాల్కనీ రోడ్డు వైపు ఉంటుంది. దీన్ని ఇతరులకు ఆమె కిరాయికి ఇచ్చింది. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆ ఇంటి ముందు నుంచి లక్ష్మీ(8), గౌతం(5) అనే అక్కాతమ్ముళ్లు, ప్రకాష్ అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తుండగా...అకస్మాత్తుగా బాల్కనీ పిట్టగోడ కూలి వారిపై పడింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా...గౌతం అనే బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. అక్కాతమ్ముళ్ల తల్లి ఒడిశాకు చెందిన ఈశ్వరి బాల్కనీ కూలిన భవనం పక్కనే మరో ఇంట్లో అద్దెకు ఉంటోంది. గౌతం మృతితో ఈశ్వరి రోదనలు మిన్నంటాయి. ఆమె భర్త ప్రస్తుతం ఒడిశాలో ఉన్నాడు. కాగా విషయం తెలుసుకుని స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేశారు.


చికిత్స పొందుతూ మృతిచెందిన గౌతం


బాల్కనీ గోడ కూలిన ప్రదేశం...